# ఆఃజిన్



చైనీస్ మూలం: లూసున్

అనువాదం: ముక్తవరం పార్థసారథి

ఇటీవల ఓ నిజాయితీ బాబు యింట్లో పనిక్కుదిరిన ఆఃజిన్ నాకు చెడ్డ చికాకు తెచ్చిపెట్టింది.

చీకటిపడగానే పెరటిగోడ దగ్గర నిల్చుని 'ఆఃజిన్' అంటూ పిలిచే ఆడ స్నేహితులూ, మగస్నేహితులూ కూడా ఆమెకు చాలామంది. ఈ రాకపోకలు మధ్య రాత్రి దాకా సాగుతూనే వుండేవి.

"బాయ్‌ఫ్రెండ్సు లేనివాళ్లు షాంఘై రావటమెందుకసలు?" అంది ఆఃజిన్ ఒకసారి.

ఇది నాకు సంబంధించిన విషయమేమికాదు. కాని దురదృష్టవశాత్తూ ఆమె యజమాని యింటి పెరటి గుమ్మం, నా యింటి ముందు తలుపూ ఎదురెదురుగా వున్నాయి. అందువల్ల రాత్రివేళ 'ఆఃజిన్' అనే ఆ పిలుపును నేను వినక తప్పదు. ఈ పిలుపులు నా రచనా వ్యాసంగానికి అడ్డుపడేవి. రచనలో నిమగ్నమైనప్పుడు కొన్నిసార్లు "...జిన్' అంటూ రాసేవాణ్ణి పరధ్యానంగా. ఇంకా యిరకాటంలో పెట్టిన విషయమేమిటంటే, నేను బయటికి వెళ్లాలంటే ఆమె బాల్కనీ దాటి మరీ వెళ్లాలి. ఆమె ఎప్పుడు ఏ స్థితిలో వుంటుందో తెలియదు. కనిపించకూడని పద్ధతిలో ఆమె నాకు కనిపిస్తే యింకేమన్నా వుందా? ఆమె యజమాని అసలే నిజాయితీ బాబు. నా తలకు గాయమైతే అదేమీ పెద్దవిషయం కాదు. ఒకవేళ చావటం జరిగినా స్థానికులు సంతాప సమావేశం పెట్టుకోవలసిన అవసరంగానీ, లేదా నిరసన ప్రదర్శన చెయ్యవలసినంత ముఖ్యమైన విషయం గానీ కాదు.

అర్థరాత్రి తర్వాత ప్రపంచం మారిపోతుంది. పగటి ఆలోచనా క్రమం రాత్రి దారితప్పుతుంది. తెల్లవారుజామున మూడింటికి ఏదో అనువాదం చేస్తూ కూర్చున్నప్పుడు వీధిలో ఎవరో సన్నగా పిలిచినట్టయింది. స్పష్టంగా వినిపించలేదుగాని అవి ఆఃజిన్ పేరూకాదు. నా పేరూ కాదు. లేచి కిటికీ తెరిచి చూశాను. ఆఃజిన్ కిటికీ ఎదురుగా ఓ మనిషి నిల్చున్నాడు. ఆ మనిషి నన్ను చూడలేదు. నా వుత్సుకతకు పశ్చాత్తాపపడి కిటికీ మూసేటంతలో ఆఃజిన్ కిటికీ రెక్క తెరుచుకుంది. నావైపు చూపిస్తూ, అతడితో ఏదో చెప్పి వెళ్లిపొమ్మంటూ సైగ చేసింది. సిగ్గుతో కుంగిపోయాను. ఆ మనిషి వెళ్లిపోయాడు. అనువాదం సాగలేదు. ఇకనుంచీ నా వ్యవహారాలేవో నేను చూసుకోవాలి తప్ప యిలా కిటికీల గుండా చూసే సాహసం చెయ్యకూడదు- మిన్నువిరిగి మీద పడినా, పక్కనే బాంబులు పడినా సరే.

ఆఃజిన్ మాత్రం యిదేమీ పట్టించుకోనట్టుగా నవ్వుతూ, తుళ్లుతూ తిరుగుతూనే వుంది. ఆమె అర్థరాత్రి సమావేశాలూ, విరగబడి నవ్వే చేష్టలూ భరించటం కష్టంగానే వుంది. అసలు, ఆమె రాకతో ఈ పరిసరాల్లోనే ఏదో మార్పు వచ్చింది. ఆమె విశిష్టత అలాంటిది. ఇలాంటి వ్యక్తి ముందర నా నిరసన ఎందుకూ కొరగాకుండా పోయింది. మరో నిజాయితీబాబు వచ్చి ఏదో చెప్పబోయినా ఎవరూవినలేదు.కాని ఆ బాబే నాలుగు తన్నేసరికి అందరూ ఎక్కడివాళ్లక్కడ చెల్లాచెదురైపోయారు.పరిస్థితి కాస్త సద్దుమణిగింది.

వారం గడిచిందోలేదో వ్యవహారం మళ్లీ మొదలు. ఆఃజిన్ ఒకనాడు యింటిదగ్గర కొట్లోని ఒకావిడతో పోట్లాడింది.జనమంతా పోగయ్యారు. ఈ గలాటా చివరన సహజంగానే ఆఃజిన్ శృంగార క్రీడల ప్రస్తావన వచ్చింది.

ఆ ముసలావిడ ఏమన్నదో వినిపించలేదుగాని ఆఃజిన్ మాత్రం "నీలాంటి ముసలి లం... ఎవరిక్కావాలే- మగాళ్లంతా నాచుట్టూ తిరుగుతారుగా ని....." అంది.

ఇది నూటికి నూరుపాళ్లు సత్యమనటానికేమీ సందేహం లేదు. ప్రేక్షకులు కూడా ఆమెవైపే మొగ్గటంతో ఎవరికీ అక్కర్లేని ఆ ముసలి లం.... ఓడిపోక తప్పలేదు. అప్పుడు విదేశీ పోలీసు ఒకడు వచ్చి పోగయిన జనాన్ని చెల్లాచెదురు చేశాడు. ఆఃజిన్ గబగబా వెళ్లి ఆ పోలీసుతో విదేశీ యాసలో ఏదో మాట్లాడింది. "నీ గురించేమీ కంప్లెయింటు లేదు. వెళ్లిపో" అన్నాడు పోలీసు. అలాగ వీధి యుద్ధం ముగిసింది. కాని మగాళ్ల మధ్యన గొడవలు మాత్రం అంత త్వరగా సమసిపోలేదు.

ఓనాడు ఓ కుర్రాడు ఆఃజిన్ యింటికొచ్చాడు. ముగ్గురు వస్తాదులు వాణ్ణి వెంటాడి పట్టుకున్నారు.వాడి చొక్కా చిరిగింది.బహుశా వాడు ఆఃజిన్ దగ్గర శరణుకోరి వుంటాడు.ప్రియురాలి రక్షణలో తప్పుందని కాదు. ఇబ్సెన్ రాసిన ఒక నాటకంలోని హీరో పేర్‌గింట్ పరాజితుడై వచ్చి తన ప్రియురాలి కొంగుచాటున దాగి ఆమె జోలపాట విన్నాడు. కాకపోతే ఆ నార్వేజియన్ మహిళ కున్న ధైర్యసాహసాలు ఆఃజిన్‌కు లేవు. ఆ మర్నాడు గుమ్మం దగ్గిరకు వచ్చీరాగానే ఆఃజిన్ తలుపు రపీల్మని వేసేసింది. కుర్రాడికి వెనక్కి తిరగటం తప్ప గత్యంతరం లేకపోయింది. గూండాలు కుర్రాడి వీపుమీద గుద్దుల వర్షం కురిపించారు. మరీ పెద్ద ప్రమాదమేమీ జరలేదు గాని ఒకడు కుర్రాడి మొహం మీద ఒకటిచ్చుకోవటంతో నెత్తురు వచ్చింది. ఈ కార్యక్రమమంతా యింకా తెల్లారకముందే, కనుమూసి తెరిచేటంతలోగా జరగటం వల్ల ప్రేక్షకులెక్కువగా లేరు. జితులూ,పరాజితులూ ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. కాసేపు ప్రశాంతంగా వుంది. శాంతి అనేది రెండు యుద్ధాల మధ్యన విరామం అని విని వుండటం వల్లనేమో నాకు మాత్రం మనసు కుదురుపడలేదు.

కొన్నాళ్ల తర్వాత ఆఃజిన్ అదృశ్యమైపోయింది.బహుశా యజమాని ఆమెను పనిలోంచి తొలగించి వుంటాడని నా అనుమానం.ఆమె స్థానంలో దబ్బపండులాంటి సొగసైన మరోమనిషి వచ్చింది. ఈవిడ వీధిగాయకులను పిలిచి 'స్పర్శించటానికి పద్దెనిమిదిచోట్లు' అనే గీతం పాడమనేది.రోజంతా కష్టపడి పనిచేశాక కాసింత వుషారు చేసుకుంటే ఎవరూ తప్పుపట్టాల్సిన పని లేదు. కాకపోతే ఆఃజిన్ పాత ప్రేమికుడితోసహా ఈ గీతం, మరో గుంపును ఆకర్షించింది. అంటే, మరో వీధి యుద్ధానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్న మాట. ఏమైతేనేం ఒక మంచి పాట విన్నాను. పిల్లికూతల్లాంటి జాజ్‌పాటలు వినివినీ విసిగెత్తిన నాకు ఈ పాట ఎంతో సహజ మధురంగా వినిపించింది.

ఆఃజిన్ సాదాసీదా మనిషి. అలాంటి వాళ్లను గుర్తుపెట్టుకోవడం కష్టం. నిజానికి ఒక నెలరోజుల్లో ఆమె ఎలా వుండేదో మరిచిపోయాను.కాని ఆమె పేరు మాత్రం ఇంకా నన్ను కలవరపరుస్తూనే వుంది. తన చుట్టూ ముఠాలను తయారుచేసుకున్నందుకు నేనామెను అసహ్యించుకోవటం లేదుగాని ముప్పైఏళ్లుగా నేనెంతో పదిలంగా పెంచి పరిరక్షించుకున్న విలువల్నీ, సిద్ధాంతాల్నీ కొద్దిరోజుల్లో తలకిందులు చేసినందుకు మాత్రం ఆమె అంటే కోపం.

పితృస్వామ్య సమాజంలో స్త్రీల కింత అధికారం వుండగలదని నేననుకోలేదు. ఓ దేశం బాగుపడటం, క్షీణించటం పురుషుల మీద ఆధారపడి వుంటుంది. మగ రచయితలు ఎక్కడ ఏ దుష్పరిణామాలు జరిగినా స్త్రీల మీదికే నిందంతా తోసేస్తుంటారు- ఇది పురుషులు ఎంత బలహీనులో సూచిస్తుంది. కాని ఇప్పుడు ఆఃజిన్- ఏ ప్రత్యేకతా లేని ఒక అతిసామాన్యమైన స్త్రీ.ఒక పనిమనిషి నెలరోజుల్లో మా బస్తీలో యింత అలజడి సృష్టించగలిగింది. ఈవిడే ఏ రాణో, రారాణో అయివుంటే మరెన్ని వుత్పాతాలు జరిగేవో!

ఆ కాలంలో కన్ఫ్యూషియస్ ఆధ్యాత్మికతకు అర్థం యాభయ్యో ఏట తెలుసుకొన్నాడట. కాని ఇప్పుడు నేను ఆఃజిన్ లాంటి స్త్రీ మూలాన పురుషులు ఎప్పుడు ఎందుకు ఎలా ప్రవర్తిస్తారో తెలుసుకోగలిగాను.

**(విదేశీ ఆధిపత్యంతో మగ్గుతున్న అప్పటి చైనీస్ సమాజాన్ని చిత్రిస్తూ లూసున్ 1934లో రాసిక కథ ఇది.)**